క్లుప్తంగా

తిమ్మాపూర్ నుంచి భారీ మెజార్టీ రావాలి


దేవేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న కేటీఆర్

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మానకొండూరు నియోజకవర్గం బూత్ ఇన్‌చార్జీలతో సమావేశానికి వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్ గెలుపు కోసం కష్టపడాలని, తిమ్మాపూర్ మండలం నుంచి భారీ మెజార్టీ తీసుకురావాలని దేవేందర్‌రెడ్డికి సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా ఫోన్లో లేదా నేరుగా తనను కలవాలని చెప్పారు. మండలంలో పార్టీ పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ మార్పులపై తెలుసుకున్నారు. లోకసభ ఎన్నికల్లో తప్పకుండా తిమ్మాపూర్ మండలంతోపాటు నియోజవర్గవ్యాప్తంగా కార్యకర్తల సహకారంతో క్యాంపెయిన్ చేసి మెజార్టీ తీసుకువస్తామని కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి కేటీఆర్‌కు హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి అబాకస్‌లో ప్రతిభ


ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

రామడుగు: వెలిచాల సరస్వతి పాఠశాల విద్యార్థి రాచమల్ల నవనీత హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి అబాకస్‌లో సత్తా చాటి ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. నవనీతకు నిర్వాహకులు చాంపియన్ ట్రోఫీ, ప్రశంసాపత్రం, రూ.2వేల నగదు బహుమతిగా అందజేశారన్నారు. స్కూల్ ట్రైనర్ కె.శిరీష, స్రవంతి, పాఠశాల కోకరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం తరలింపులో ఆలస్యం.. పరిష్కరించిన అధికారులు


దేశాయిపేట కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్

చొప్పదండి: దేశాయిపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో శ్రీధర్ ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని దృష్టికి రావడంతో.. డీఆర్‌డీవో అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రానికి వచ్చారు. తరలింపు సమస్యతో కుప్పలు పేరుకుపోవడంతో ఆయన లారీ అసోషియేషన్ నాయకులతో మాట్లాడారు. లారీలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టు సమస్యను పరిష్కరించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, ఏపీఎం నర్మద, రాజేశ్, సీసీ చంద్రనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గూటికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి



హుజూరాబాద్: హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. అయిదేళ్ల క్రితం బీజేపీలో ఉన్న పెద్దిరెడ్డి హుజూరాబాద్ ఉప ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుజూరాబాద్–హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యం దక్కడం లేదని 2 నెలల క్రితం రాజీనామా చేశారు. హుజూరాబాద్ ప్రాంతంలో మంచి పేరు, పరిచయాలున్న పెద్దిరెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించాలని ఆ పార్టీ పెద్దలు సంప్రదించినట్లు తెలిసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌లను పెద్దిరెడ్డి కలిసినట్లు సమాచారం.


హుజూరాబాద్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


గన్నేరువరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


శంకరపట్నం: గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

హుజూరాబాద్: 1998–1999 విద్యా సంవత్సరంలో పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు క్లెప్పు సుధాకర్ రావు, ఆగయ్య, సదానందం, శ్రీకాంత్, కాజీపేట శోభ, విద్యార్థులు భరత్, శ్రీనివాస్, సతీష్, రవికిరణ్, సృజన, భాస్కర్, జయపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదోతరగతి చదివిన విద్యార్థులు 30 ఏళ్ల గడిచిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు. వంటావార్పుతో సమ్మేళనాన్ని అపూర్వంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు ఏలేటి మల్లారెడ్డి, స్వామిరెడ్డి, రామచంద్రం, సీనియర్ అసిస్టెంట్ రామస్వామి, అటెండర్ మల్లేశం పాల్గొన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మొలంగూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–1993 పదోతరగతి చదివిన విద్యార్థులు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి, సుందరగిరి వరకు, ఇందుర్తి–నవాబుపేట–కొండాపూర్ వరకు ఎంపీ నిధులు రూ.39కోట్లతో చేపట్టిన రోడ్డుకు బీటీ పనులు ప్రారంభమయ్యాయి. ఏడు నెలల క్రితం బీటీ రోడ్డు పనులకు కాంట్రాక్టర్లు శ్రీకారం చుట్టి రోడ్డును తవ్వి కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు పలుమార్లు బండి సంజయ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన బీటీ రోడ్డు పనులు ప్రారంభించేలా చూశారు. ఆదివారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు గూల్ల రాజు, ఎన్నం సంతోష్, వెంకటేశం, గూల్ల సాయి, రాము, నవీన్, పలువురు నాయకులు బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా పనులు చేయాలని కోరారు.



పోచమ్మ బోనాలు

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ వీధులు గుండా డప్పుచప్పుళ్లతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవం కార్యక్రమాలను మే 19 నుంచి నిర్వహించనున్నారు. ఇది పురస్కరించుకొని ప్రతి ఏడాది వార్షికోత్సవం ముందు పోచమ్మ బోనాలు నిర్వహించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


మెమొంటో అందజేస్తున్న దబ్బెట విజయరవీందర్, డైరెక్టర్లు

జమ్మికుంట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చాణక్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దబ్బెట విజయరవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో చాణక్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చిరంజీవి, శివ, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ప్రత్యక్ష ఆందోళన


మాట్లాడుతున్న సంద గణేశ్

కరీంనగర్: ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీ, అనుమతి లేని పాఠశాలల గుర్తింపు రద్దుకు ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తామని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో తిరుపతి అధ్యక్షతన జరిగిన నగర కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే, ప్రభుత్వం ఎలాంటి అడ్మిషన్లకు అనుమతి ఇవ్వకముందే తమ ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేస్తూ ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. అనేక సందర్భాల్లో జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. యజమాన్యాలతో విద్యాధికారులు కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. విద్యాధికారుల నిర్లక్ష్యం వల్లనే నగరంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలు విచ్చలవిడి వ్యవహరిస్తున్నాయని తెలిపారు. జిల్లా విద్యాధికారులపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కుమార్, నవీన్, తిరుపతి, మహేశ్, అఖిల్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి విజయం సాధిస్తుంది

విద్యానగర్(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రాబోతుందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఇండియా కూటమి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. బీజేపీ తన పదేళ్ల పాలనలో సాధించింది ఏమి లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కొరివి వేణుగోపాల్ అన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలి


గంగాధర: ప్రచారం చేస్తున్న శోభ, బీజేపీ నాయకులు


జమ్మికుంట: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర: గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి హామీని అమలు చేయని కాంగ్రెస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీజేపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభ పిలుపునిచ్చారు. ఇంటింటికి బీజేపీ ప్రచారంలో భాగంగా ఆదివారం గట్టుభూత్కూర్ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేండ్ల శ్రీనివాస్, జారతకొండ మహేశ్, తిరుపతి, శ్రీధర్, రాంగోపాల్‌రెడ్డి, పెరుక శ్రావణ్‌కుమార్, వైద రామానుజం, కోల అశోక్, తూము నారాయణ, వొడ్నాల రాజు, బైరి ప్రభాకర్‌రెడ్డి, సదాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ప్రధాని మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని, బీజేపీ పాలనలో దేశం సురక్షితంగా ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 39 బూత్‌లలో ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, కోఆర్డినేటర్ మండ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, అకుల రాజేందర్, రాజేశ్‌ఠాకూర్, పల్లపు రవి, జగన్, రవిచంద్రర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: దేశరాజ్‌పల్లి, రామడుగు, షానగర్, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఉప్పు రాంకిషన్, ఐలయ్య, రమేశ్, సునీల్, శ్రీనివాస్‌పటేల్, రవీందర్ పాల్గొన్నారు.

చొప్పదండి: సమస్యలపై పోరాటం చేస్తూ పరిష్కరించడమే కాకుండా.. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌కు మరోమారు అవకాశమివ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ కోరారు. గుమ్లాపూర్‌లో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. విలాసాగరం అంజయ్య, కోలపురి కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని యువ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. కనగర్తి గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. బూత్ కోఆర్డినేటర్ బండి రాజు, అధ్యక్షుడు ఈరబోయిన సతీష్, సీనియర్ నాయకులు బుర్ర మల్లయ్య, దేవునూరి కిరణ్, సుధాకర్, రాజయ్య, సమ్మారావు, శ్రీనాథ్, అక్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేశారు. మొలంగూర్, కరీంపేట, ఇప్పలపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ కోమల ఆంజనేయులు, దేవేందర్‌యాదవ్, దండు కొంరయ్య, నరేందర్, శ్రీనివాస్, జగ్గారెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


హుజూరాబాద్: కాంగ్రెస్‌లో చేరిన వారితో ప్రణవ్‌బాబు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బల్మూరి వెంకట్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో బీజేపీ పట్టణ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు లంకదాసరి గంగరాజు, ముక్క మహేందర్, రామ్‌నరేశ్ తదితరులున్నారు. లంకదాసరి గంగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మికుంట: ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసాల రామస్వామి, తనుగుల గ్రామానికి చెందిన ఎంపీటీసీ వాసాల నిరోష, జమ్మికుంట, వీణవంక మండల బీఎస్పీ అధ్యక్షులు పంజాల దిలీప్‌గౌడ్, కొంగల కుమార్‌యాదవ్, జిల్లా కార్యదర్శి పుల్లాల నరేశ్, వెంకటేశ్, నమిండ్ల సురేందర్, లద్దునూరి మధు, కాసుల పవన్, శనిగరపు కుమార్‌తోపాటు తనుగుల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జక్కె రాజేశ్‌గౌడ్ ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం, రామన్నపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన బీజేపీ నాయకులు



రామడుగు: మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను ఎంపీ కార్యాలయంలో కలిశారు. తిరుపతి నుంచి తీసుకొచ్చిన లడ్డు ప్రసాదం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. బొమ్మకంటి భాస్కరాచారి, కట్ట రవీందర్, శ్రీనివాసాచారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సివిల్స్ విజేత..

కరీంనగర్‌టౌన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 82వ ర్యాంకు సాధించిన సివిల్స్ విజేత మెరుగు కౌశిక్ ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనగాం జిల్లాకు చెందిన కౌశిక్‌ను బండి సంజయ్ అభినందించారు. పట్టుదల, అంకిత భావంతో పరీక్షలు రాసి అత్యున్నత ఉద్యోగానికి ఎంపిక కావడం మామూలు విషయం కాదన్నారు. సివిల్స్ ఉద్యోగంలో చేరిన తర్వాత సమాజంలో అట్టడుగున్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలి


మాట్లాడుతున్న అమర్‌నాథ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపెల్లి అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ అంబేద్కర్ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమిని చూసిన తర్వాత ఆ పార్టీ నాయకులు బీజేపీ, కాంగ్రెస్‌లలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు ప్రతీ కుటుంబానికి మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తానని, ప్రతీ కుటుంబానికి దళిత బంధు ఇస్తానని, అనేక రకాలుగా ఆశ చూపి దళితుల ఓట్లను దండుకొని చివరకు వారిని అవమానాలకు గురిచేశారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గోపాల భూషణ్ రావు, సంతోష్‌కుమార్, తిరుమలయ్య, పురుషోత్తం, విజయ్‌కుమార్, అనిల్ కుమార్, కత్తెర దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా రమేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర కోశాధికారిగా కరీంనగర్ జిల్లాకు చెందిన రత్నం రమేశ్‌ను ఎన్నుకున్నారు. కొత్తగూడెంలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో ఇంటింటా ప్రచారం చేపట్టాలి

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నగరంలోని డివిజన్‌లలో ఇంటింటి ప్రచారం చేయాలని పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మల్లికార్జున రాజేందర్, ఎండీ.ఆరిఫ్ అన్నారు. ఆదివారం నగరంలోని 14, 15, 16, 37, 38, 55 డివిజన్‌లకు సంబంధించి మల్లికార్జున రాజేందర్, 4, 5, 27, 28, 29 డివిజన్‌లకు సంబంధించి ఆరిఫ్‌లు డీసీసీ కార్యాలయంలో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభేదాలు ప్రక్కన పెట్టి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎండలు మండుతున్నందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించాలని తెలిపారు. ఈ సమావేశాల్లో ఆయా డివిజన్‌లకు సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.